# 'కళ తప్పిన కళ'

కొన్నేళ్ల క్రితం వ్యక్తిగత కారణాన పొరుగు జిల్లా కేంద్రంలో ఓ నలభై రోజులు ఉండవల్సిన అగత్యం ఏర్పడింది. ఓ పరిచయస్తుడు తన ఇరుగు గదిని నాతో పంచుకోదానికి సహకరించాడు. ఆ గది పాత టౌన్లో... ఇరుకు వీధిలో. అక్కడ్నించీ మెయిన్ రోడ్డు మీదకు రావడానికి ప్రపంచంలోని అశుభ్రతనంతా దాటుకుంటూ రావాలి.

ఆ ఇరుకు మురికి వీధి చివర్న యింకో శిథిల గృహం. ఆ ఇంటి ముందో చెత్త దిబ్బ. బోరు పంపు ద్వారా జనాలు అలక్ష్యంగా వదిలిన నీటి కాలువ. సభ్యా సభ్యతల్తో నిమిత్తం లేని పిల్లలు శౌచాలు.

వీటన్నింటినీ అధిగమిస్తూ ఆ ఇంటిలోంచి ఉదయం అయిదున్నరా అరు ప్రాంతంనించి తొమ్మిది వరకూ సాయంకాలం అయిదున్నరా ఆరునించి ఎనిమిది వరకూ పిల్లలు ముక్తకంఠంతో పాడే స్వరాలు.

ఒక్కోమాటు ఒక్కోలా.

ఒకసారి సరళీస్వరాలు.

ఒకసారి గీతాలు... ఒకసారి వర్ణాలూ కీర్తనలు.

ఇంకోసారి వాయులీన నాదాలు.

ఇంటిబైటి అశుద్ధాన్ని క్షాళనం చేస్తూ... సంగీత పరిమళాలు.

ఆ ఇంటిని దాటుతున్నప్పుడు ఆ సమయాన నా కాళ్లు నా ప్రమేయం లేకుండానే ఆగిపోయేవి.

సంగీతం పట్ల నాకున్న ప్రేమకున్నా... అది సంగీతంలోని మహత్తు అని నా అభిప్రాయం.

ఓ పదిరోజులు చూసా... విన్నా... ఇక నన్ను నేను ఆపుకోలేక ఓ సాయం సమయాన ఆ ఇంట్లోకి అడుగుపెట్టా.

చాప మీద కూచుని ఏడెనిమిది మంది అమ్మాయిలు 'కల్యాణి'లో కమలజాదళ' గీతం స్వరాలు పలుకుతున్నారు.

నేను లోపలి కదుగుపెట్టగానే ఠక్కున ఆపేసారు.

వాళ్లకెదురుగా కూచున్నావిడ "ఏమైంది? ఎందుకాపారు?" అని కరకుగా అంది.

"క్షమించండి నా రాకవల్ల ఆపారు. నేనీ వీధి చివర్నే వుంటున్నాను..." అని క్షమాపణలు చెప్పబోతూండగా ఆవిడ కొద్దిగా కరకుగా వున్న స్వరంతో "మీ పిల్లల్ని ట్యూషన్కి చేర్చే విషయమైతే ఉదయం తొమ్మిది తర్వాతరండి" అని నిష్కర్షగా చెప్పేసింది.

ఆవిడ అంధురాలు. మొహం నిండా స్ఫోటకపు మచ్చలు. క్షమాపణ చెప్పి వచ్చేశాను. ఆ తర్వాత నాకు ఆతిథ్యమిచ్చిన వ్యక్తిని వాకబు చేశాను ఆమె గురించి. ఆమే ఆమె తమ్ముడూ కలిసి జీవిస్తున్నారు. తమ్ముడు ఆరండ్బీలో అటెండరు. ఆమె సంగీతం పాఠాలు చెబుతుంది. అతను వంటావార్పూ చూసుకుని ఆఫీసుకెళ్తాడు. వున్నంతలో గట్టిగా బతుకు వెళ్లదీస్తున్నారు అని తెల్సింది.

* * *

తర్వాత కొన్ని నెలలకు ఓ ప్రముఖ వాద్యకారుడి వాద్య విన్నాణ ప్రదర్శన అన్న వార్త తెలిసి ఆ ఊరు వెళ్లాను. సాయంకాలం ఆరుగంటలకు కార్యక్రమారంభం.

ఆ ప్రముఖ వాద్యకారులు మధ్యాహ్నమే వేంచేశారు. వారికి హోటల్లో ఏ.సి. గది ఏర్పాటుచేశారు నిర్వాహకులు. నేను వెళితే వారెవ్వరికీ ఇంటర్వ్యూ ఇవ్వరు అన్నారు. అసలు కారణం ఆ వాద్యకారుడు దిగడం దిగడం మధుభాండంతో దిగారు. వారి మధు సేవనం సాయంత్రం అయిదింటివరకూ కొనసాగింది.

ఆరింటికి ఆ 'మధు' సూదనులు తూలుతూ దిగారు సభా ప్రాంగణాన. వచ్చి వాద్యం ముందు కూలబడ్డారు. మార్దంగికులూ ఘటవాదకులూ సిద్ధంగా వున్నారు. పక్క వాద్యంగా వయొలిన్ పట్టుకుని ఈవిడ నల్ల కళ్లజోడుతో... ఆమెను చూడగానే ఆనందమేసింది.

ఆ ప్రముఖ వాద్యకారులు వాద్యం మీద చెయ్యి నిలుపలేకపోతున్నారు. జనం గ్రహించారు.

ఓ గోల...

ఆమె పరిస్థితి అర్థం చేసుకొని తన వయొలిన్ని పలికించారు. 'హంసధ్వని'లో త్యాగరాజకృతి 'రఘునాయిక నీపాద రాజీవముల నే విడజాల'తో మొదలుపెట్టి ఏకధాటిగా గంటసేపు సరస్వతీ అర్చన చేశారు. శ్రోతలు శాంతించారు. పూర్తి తృప్తితో కాకున్నా ఆ సాయంత్రం భ్రష్టుపట్టిపోలేదన్న భావనతో వెళ్లిపోయారు.

ఆ తర్వాత ఆమెకు నన్ను నేను పరిచయం చేసుకుని నాకున్న సంగీత పరమైన అజ్ఞానాన్ని ఆమె సహాయంతో కొద్దిగా కడుక్కున్నాను.

* * *

ఈమధ్య మళ్ళీ ఆ ఊరు వెళ్లడం తటస్థించింది. ఆవిడ ఇంటికి వెళ్లాను ఒకవిధమైన భరించరాని నిశ్శబ్దం *(eerie silence)* తలుపులు తట్టాను. “ఎవరూ...?” అని ముద్దముద్దగా అస్పష్టంగా వినిపించింది. తలుపులు తెరుచుకున్నాయి. ఆవిడే... ఎడమ కాలు యీడుస్తూ... నోరు వంకరపోయి...

ఆ ఇల్లు ఎందుకు మూగవోయిందో నాకు తెలియజేస్తూ ఆమె శిథిల చిత్రం నా ఎదుట. ●